గురువులపై గురుతర బాధ్యత

ప్రతీ వ్యక్తి జీవితంలో గురువు స్థానం మహోన్నతమైందని వక్తలు పేర్కొన్నారు. విలువలతో కూడిన విద్యను అందించి, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి దేశానికి ప్రథమ పౌరుడి స్థాయికి ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ అందరికీ స్ఫూర్తిప్రదాత అన్నారు. సర్వేపల్లి జయంతిని పురస్కరించుకుని కళాశాలల్లో, పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు.

- సర్వేపల్లి.. స్ఫూర్తి ప్రదాత
- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- వేడుకగా గురుపూజోత్సవం


సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి


అంబేడ్కర్‌నగర్ పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఏయూక్యాంపస్: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే గురుతర బాధ్యతను గురువులదేనని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతి ఆచార్యుల ప్రతిష్టను పెంచుతుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహా రావు, కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, జి.శశిభూషణ రావు, కె.విశ్వేశ్వర రావు, వి.విజయలక్ష్మి, డీన్‌లు, విభాగాధిపతులు, ఆచార్యులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు ఏయూ ఉన్నతాధికారులు, ఆచార్యులు, పరిశోధకులు, ఉద్యోగులు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో పాటు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీ కళాశాలలు, విభాగాలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

- ఏయూ విద్యా విభాగంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు పూలమాల వేసి, నివాళులర్పించారు. విభాగ ఆచార్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.
- గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో నిర్వహించిన టీచర్స్ డే వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయినిగా టి.సరోజినీ దేవిని గాయత్రి యాజమాన్యం ఘనంగా సత్కరించింది. విద్యాసంస్థల ఉపాధ్యక్షుడు ఆచార్య డి.దక్షిణామూర్తి, ఆచార్య ప్రగడ రాజు గణపతి, ప్రిన్సిపాల్ కె.మధురవాణి పాల్గొన్నారు.

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల, సంతపాలెం, ఆపరేషన్‌కాలనీ, భగత్‌సింగ్‌నగర్, ఎస్‌ఐజీ నగర్ పాఠశాలలతోపాటు భారతీ విద్యానికేతన్, శ్రీకృష్ణాగ్రామర్, వీఎస్టీ, విశ్వతేజ, విశ్వవిజ్ఞాన్, ఉషోదయ తదితర ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఆయా పాఠశాలలకు పిల్లలు ఉపాధ్యాయుల వేషధారణలో వచ్చి సందడి చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు ఉపాధ్యాయులతోపాటు పిల్లలు నివాళులర్పించారు.


వేడుకల్లో పాల్గొన్న ఐఐఏఎం ఉపాధ్యాయులు

- జీవీఎంసీ 12వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. కన్నేటి సుబ్బారెడ్డి, పి.ఐ బాలరాజు, హుస్సేన్, మోహన్, రాజులమ్మ, సంతోష్, వాసు, శ్రీను పాల్గొన్నారు.

ఉపాధ్యాయ మేయర్..

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పరిధి అంబేడ్కనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రెడాయ్ సంస్థ అందించిన జ్యూట్ బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయురాలిగా మారి పిల్లలకు పాఠాలు బోధించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, ఉపాధ్యాయులు, క్రెడాయ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్ – 9లోని దివ్యాంగుల పాఠశాలలో గురుపూజోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజాన్ని ఉన్నతంగా నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి, పాఠశాల చైర్మన్ లక్ష్మణరావు, అధ్యక్షుడు సాయినాథ రావు, ప్రిన్సిపల్ సుధ పాల్గొన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు.

- ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఐఐఏఎం కార్యదర్శి సుంకరి రవీంద్ర ఉపాధ్యాయులను సత్కరించారు. అల్వార్‌దాస్ గ్రూప్ ఉపాధ్యాయులు పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఎంవీపీ కాలనీ సెక్టార్ – 7లోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో ఏవీఎన్ కళాశాల మాజీ వైస్ ప్రిన్సిపల్ నరవ ప్రకాశరావును సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరరావు పాల్గొన్నారు. కిడ్స్ గార్డెన్ పబ్లిక్ స్కూల్‌లో టీచర్స్‌డే వేడుకల్లో ప్రిన్సిపల్ సాయిలక్ష్మి పాల్గొన్నారు.


సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీతారాం తదితరులు


సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వెంకోజీపాలెం పాఠశాలలో ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న నాయకులు

- హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు విశిష్ట సేవలు అందిస్తున్న 30 మంది అధ్యాపకులను సత్కరించారు. నిర్వాహకుడు కండిపల్లి శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు వెంకోజీపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య హాజరై ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, లీగల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు గిరిబాబు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల వేషధారణలో భారతీ స్కూల్ విద్యార్థులు

క్లుప్తంగా

అలరించిన 'స్తోత్ర గాన ఝరి'


కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో 'స్తోత్ర గాన ఝరి' ఆధ్యాత్మిక కార్యక్రమం ఆద్యంతం అలరించింది. శ్రీకంచి కామకోటి శంకరమఠం విశాఖపట్నం, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీమాన్ తాళ్లపాక స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వామీజీని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు పాడిన సంకీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో మఠం కార్యదర్శి అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ప్రకటనలు కోరుతూ ర్యాలీ

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ నిరుద్యోగులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని ఎంవీపీ సర్కిల్ నుంచి ఏఎస్ రాజా మైదానం వరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవిరావు ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ గ్రూప్ – 2తోపాటు జూనియర్ లెక్చరర్స్, ఏఈల పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అనాథ మృతదేహానికి 'రెడ్ క్రాస్' అంత్యక్రియలు

ఎంవీపీకాలనీ: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి 17వ వార్డులోని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరిలివి.. ఆగస్టు 30వ తేదీన నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని సొసైటీ ప్రతినిధులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో జాయిన్ చేశారు. ఆయనకు ఎవరూ లేరని తెలియడంతో తామే సేవలందించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆ వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో ఈ నెల 4వ తేదీన మరణించారు. కేజీహెచ్ సీఎస్‌ఆర్‌ఎం అందించిన సమాచారంతో రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఆ వ్యక్తి శవానికి పంచనామా పూర్తి చేయించారు. అనంతరం మృతదేహాన్ని జ్ఞానాపురంలోని శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి మురళి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో గ్లాస్ రీయిన్‌ఫోర్స్ కాంక్రీట్ పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా బుధ, గురువారాల్లో భీమిలి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ టి.ఎల్.సుధాకర్ తెలిపారు. తగరపువలస గోస్తనీనది కొండపేట పంపింగ్ స్టేషన్ నుంచి భీమిలి పట్టణంలో 450 కేఎల్, 800 కేఎల్ రిజర్వాయర్లకు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ పలుచోట్ల మరమ్మతులకు గురయ్యింది. ఈ కారణంగా రెండు రోజులు భీమిలి పట్టణ ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటి కోసం డి.హరి (63003 89896), త్రినాథ్ (98660 46100)ను సంప్రదించాలని ఏఈ సుధాకర్ సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

పద్మనాభం: మహిళల్లో 40 ఏళ్లు దాటిన వారికి క్యాన్సర్ రావచ్చని బ్రింద ఆస్పత్రి అంకాలజిస్టు వంశీధర్ అన్నారు. కృష్ణాపురంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గ్రామీణ వైద్యులకు క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎనిమిది నుంచి 14 ఏళ్ల వయస్సు మధ్యలో క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్ ఉందన్నారు. మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు ఆర్.అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి, తాతబాబు, రామారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిత

ఏయూక్యాంపస్: యువతపైనే దేశ భవిత ఆధారపడి ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే బాధ్యత అధ్యాపకులదేనన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన యువజన అభివృద్ధి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జాతీయ సేవా పథకం యువతను మార్పునకు సాధనాలుగా తయారు చేయాలని, తద్వారా వారిని నిపుణులైన మానవ వనరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక కార్యకర్త ఆచార్య కె.శేఖర్ మాట్లాడుతూ యువతకు కెరీర్ కౌన్సెలింగ్ ఎంతో అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఈ దిశగా యువతకు మార్గనిర్దేశం చేయాలన్నారు. యువతలో నైపుణ్యాలను వృద్ధి చేయాలని, దేశానికి సంపద సృష్టించే ప్రక్రియలో వారిని భాగస్వాములు చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా యువత – మత్తు పదార్థాలు, యువత-రిస్క్ బిహేవియర్, యువత-మాతృభాషలో విద్యాబోధన, యువత-సామాజిక మాధ్యమాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్.హరనాథ్, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, విజయనగరం జిల్లా ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఓటర్ల జాబితాల పరిశీలన పూర్తి


సమావేశంలో ఆర్‌డీవో భాస్కర రెడ్డి, తదితరులు

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఓటర్ల జాబితాల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. మంగళవారం వివిధ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ప్రాంతాల్లోనూ ఇంటింటికీ బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు వెళ్లి ఓటర్ల జాబితా సరిచూశారన్నారు. అవసరమైన చోట తొలగింపులు, కొత్తవి నమోదు చేశారని తెలిపారు. ఈ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. అలాగే 1,500 మంది ఓటర్లు దాటితే అదనంగా కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, ఆయా ప్రాంతాల్లో అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే అన్ని ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్‌తోపాటు ఇతర సిబ్బంది పరిశీలిస్తున్నారని, అవసరమైన చోట కొత్త కేంద్రాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కె.వేణుగోపాల్, నాయకులు గంటా నూకరాజు, చంద్రరావు, కదిరి జగన్నాథం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట

దాబాగార్డెన్స్ : సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి గడువు ముగిసినప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కరించకపోవడంతో ఈ నెల 15 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టనున్నారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరికిటి రాజు, అధ్యక్షుడు నూకరాజు తెలిపారు.

ఈ మేరకు మంగళవారం సిటు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 16న కార్మిక డిమాండ్లపై జరిగిన ఒప్పందం సందర్భంగా తాత్కాలికంగా సమ్మె వాయిదా వేశామన్నారు. గత నెల 31లోగా మొత్తం 38 డిమాండ్లు పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారని, గడువు ముగిసినప్పటికీ ఏ ఒక్క డిమాండ్ పరిష్కరించలేదని, సమస్య లు వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 15 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టనున్నారని తెలిపారు. పారిశుధ్య విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లించాలని, సిబ్బందిని పెంచాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్.రమణ, జె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్ చేటు.. పౌష్టికాహారమే మేలు


పోటీల విజేతలతో మ్యాజిక్ బస్ ప్రతినిధులు

తగరపువలస: జంక్‌ఫుడ్ ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని హరిస్తుందని, పౌష్టికాహారమే సంపూర్ణ ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని జీవీఎంసీ సంతపేట అంబేడ్కర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై.జగన్నాథ స్వామి అన్నారు. మంగళవారం మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్‌లో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. జంక్‌ఫుడ్ వల్ల చిన్నారుల శరీర ఆకృతి వికృతంగా మారుతుండడమే కాకుండా ఇమ్యూనిటీ తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు పౌష్టికాహార పోటీలు నిర్వహించి ఎక్కువ పోషకాలతో వంటలు సిద్ధం చేసిన తల్లులకు స్టీల్ బిందెలు, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ లంచ్ బాక్స్‌లు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నంనాయుడు, శ్రీను, మ్యాజిక్ బస్ మోనిటరింగ్ అధికారి దూడ రమేష్, ప్రతినిధులు శారద, రమ్య, సుజాత, గౌరీ శిరీష, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు మంగళవారం 20వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

7న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 7న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

భర్త నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు

జనసేనలో ఉండడంతో ఏమీ చేయలేరని బెదిరిస్తున్నాడని భార్య వెల్లడి



పెందుర్తి పోలీస్‌స్టేషన్ వద్ద చింతగట్ల గ్రామస్తులు, బంధువులతో త్రివేణి

సింహాచలం: భర్త వేధింపులు తట్టుకోలేక పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది ఓ భార్య. జనసేన పార్టీలో ఉన్న తనను ఎవరూ ఏమీ చేయలేరని పదే పదే వేధించడంతోపాటు చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. భర్త వల్ల తనకు ప్రాణహాని ఉందని పోలీసులు, మీడియా ఎదుట తన ఆవేదనను వెల్లడించింది. ఆమె మాటల్లోనే.... చింతగట్లకు చెందిన మునస త్రివేణి, మునస శివ ఏడేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. శివ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లైన కొత్తలో బాగానే ఉన్నా ఆ తర్వాత నుంచి త్రివేణిని వేధించడం మొదలుపెట్టాడు. అంతే కాకుండా వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెతో కూడా త్రివేణిని బెదిరిస్తున్నాడు. నువ్వు కట్నం తీసుకురాలేదు.. ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో అని, జనసేన పార్టీలో ఉన్న తన వెనుక అయిత సింహాచలం, దమ్ము రమేష్, చందక గోవింద్ తదితరులు ఉన్నారని బెదిరిస్తున్నాడని వాపోయింది. దీంతో కొన్ని రోజుల కిందట నుంచి ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటిలోనే ఉంటోంది. కాగా శివ సోమవారం త్రివేణి పుట్టింటికి ఆమె తల్లితోపాటు అన్నయ్యను కొట్టి బలవంతంగా త్రివేణిని తన ఇంటికి తీసుకొచ్చేశాడు. దీంతో తన భర్త శివ తీరుతో భయంగా ఉందని మంగళవారం బంధువులు, చింతగట్లలోని పలువురు నిర్వాసితులతో కలిసి పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అసిరి తాతను కలిసి త్రివేణి ఫిర్యాదు చేసింది. కుటుంబ విషయం కావడంతో దిశ పోలీస్ స్టేషన్‌కి వెళ్లాలని పెందుర్తి పోలీసులు సూచించారు.

ఆర్టీసీ బస్సు కింద పడి వృద్ధురాలి మృతి

అల్లిపురం : ఆర్టీసీ బస్సు కింద పడి గుర్తు తెలియని వృద్ధురాలు ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ద్వారకాబస్ స్టేషన్ వద్ద భిక్షాటన చేసుకునే ఆమె ప్రమాదవశాత్తు 38 హెచ్ బస్ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సుమారు 5 అడుగుల ఎత్తు కలిగిన ఆమెను గుర్తించిన వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ బి.తిరుమల రావు కోరారు. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 9908001600 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పలువురు ప్రముఖులకు ఘన సత్కారం


సత్కారం పొందిన వారితో అనూష పట్నాయిక్

బీచ్‌రోడ్డు: శిష్టకరణ సామాజిక వర్గంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని మంగళవారం శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయిక్ ఘనంగా సత్కరించారు. రామ్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌జేడీ మణిపాత్రుని జ్యోతి కుమారి, మన్యం జిల్లా డీఎస్పీ బలివాడ నాగేశ్వరరావు, సినీ నిర్మాత బాలాజీ రామలింగం, పౌరాణిక నటులు డొంకాడ రామచంద్రరావు, సినీ దర్శకులు దుగ్గివలస దివాకర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శిష్టకరణ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు కె.వెంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎన్‌కే మహంతి, ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకుడు పెద్దరాజు తదితరులు కల్యాణం నిర్వహించారు.